తానెంత వెర్రివాడు? ఊర్మిళాదేవి తప్ప, చివరికి ఆమె పెంపుడు కీరవాణితో సహా మొత్తం అయోధ్య అంతా ఆ రాత్రి మేల్కొని ఉండి, రాముడికి స్వాగతం చెబుతుందనుకున్నాడు.

"ఓ నిద్రాదేవీ! నువ్వు నిజంగా గొప్ప దానివి. పద్నాలుగేళ్ళు... కళ్ళు మూసినా తెరిచినా కూడా రాముని పాదపద్మాలే దర్శిస్తూ రాముడిని స్మరిస్తూ, రాముడి కోసం నిరీక్షిస్తూ తపించిన వాళ్ళని కూడా నీ మాయతో, మరో మాట లేకుండా నిద్రపుచ్చావే! సరయు నది గలగలలు నీ విజయానికి మంగళ కైవారాలని అనుకోకు. అయోధ్య పై నీ విజయానికి అస్తిత్వం లేకుండా, ఇదిగో... రాముడిని నా కళ్ళల్లో, ఊపిరిలో, రక్తంలో నింపుకోవడానికి అనిమేషుడినై నేను వెళ్తున్నాను."

"జయోస్తు!" అన్నట్టు వర్షపు చినుకులు పడ్డాయి. అతడి శరీరం పులకించింది. అరచేతి మీద పడిన నీటి చినుకు వైపు చూశాడు. తలెత్తి మేఘం వైపు చూశాడు. వర్షమెందుకు పడిందో అతనికి తెలుసు. అర్థమైనట్టు నవ్వాడు.

భూదేవి అలిగింది. అలగదూ మరి...!

ఆమె అనుకుని ఉంటుంది...' వనవాసానికి వెళ్ళినప్పుడు అల్లుడు నన్ను స్పృశిస్తూ.. గిరులు, ఝరులు దాటుకుంటూ న...డు...చు...కుంటూ వెళ్లిన వాడు, పట్టాభిషేకం వచ్చేసరికి గాలిలో తేలుతూ వస్తున్నాడు. పుష్పక విమానం ఎక్కి ఆకాశం తోనూ, మేఘాలతోనూ చెలిమి చేస్తున్నాడు. లోకంలో జామాతలను ఏనాడు నమ్మరాదు కదా' అని అలిగిందట.

ఆమె అలక తీర్చడానికి మేఘాలు వర్షపు చినుకులతో రాయబారమంపుతున్నాయి. 'తల్లీ! నీ కూతురూ, అల్లుడూ ఎప్పుడూ నీవద్ద ఉండేవారే కదమ్మా. కొద్దిసేపైనా మాతో ముచ్చటించనీ' అని.

"మరి గుహుడూ ఈ విధంగానే అలిగి ఉంటాడు కదా. అతడి అలకా సహేతుకమే! అతడినే విధంగా ఓదారుస్తాయో ఈ మేఘాలు?" అనుకుంటూ శ్రీహితుడు ఆకాశం వైపు చూశాడు. చంద్రుడి జాడే లేదు. విజయదశమి నాడు రావణ వధ. అయోధ్యకు అమావాస్య నాడు రాక. శ్రీహితుడు అలా అనుకోలేదు. "ఏమయ్యా చంద్రుడా! అమ్మవారి అనుంగు సోదరా! ఎదురేగి బావగార్ని తీసుకురావడానికి వెళ్ళవా?" అనుకున్నాడు.

తూరుపుకు తిరిగి, రాజమార్గాన ప్రవేశించాడు. అశోక చెట్ల గుబురులు గాలికి తలలూపుతున్నాయి. అతడికి హనుమంతుడు 'సీతాదేవి అశోక వృక్షం క్రిందే కూర్చుని శోకించింద'ని చెప్పిన వైనం గుర్తొచ్చింది. ఆర్ద్రంగా ఆ చెట్లకేసి చూశాడు.

